క్లుప్తంగా

విధుల్లో అలసత్వం తగదు

చండ్రుగొండ: ఎన్నికల విధుల్లో అలసత్వం తగదని బూత్‌లెవల్ అధికారులకు మాస్టర్ ట్రైనీ వినయ్ సూచించారు. మండలకేంద్రం చండ్రుగొండలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన బూత్‌లెవల్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. రాబోవు పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల్లో విధులు సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని, కొత్త ఓటర్ల నమోదు పగడ్బందిగా చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాదియాసుల్తానా, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం పట్టణ సీఐ నాగరాజు రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళశారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. ఎవరి ఇంటి వద్ద వారే ప్రశాంతమైన వాతావరణంలోనే వారి వారి పుట్టిన రోజు వేడుకలు చేసుకోవాలని ఆయన సూచించారు. ఏదైనా అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పుట్టిన రోజు వేడుకల పేరుతో రాత్రి సమయంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలను ప్రమాదకరం నడిపి, ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు మృతి

కరకగూడెం: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కొమ్ము కృష్ణ (55) గుండెపోటుతో సోమవారం అర్ధరాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందా సంతోష్ కుమార్, సమత్‌భట్టుపల్లి సర్పంచ్ పోలేబోయిన శ్రీవాణి మంగళవారం మృతుని పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, నాయకులు ఎర్ర సురేష్, సాగర్, జలగం క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి...

మణుగూరురూరల్: మున్సిపాలిటి పరిధిలోని కొత్త కొండాపురం గ్రామంలో గిరిజన నాయకుడు కొమరం ముసలయ్య(65) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇఫ్టూ నాయకుడు నాసర్‌పాషా మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు. అలాగే మణుగూరు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ముసలయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. సంతాపం తెలిపిన వారిలో కొత్తకొండాపురం గ్రామస్తులు కోడి నరసింహారావు, రామకృష్ణ, బి.సీతారాములు, సత్యం, భద్రం ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: గత ఏడాది తుపాన్ కారణంగా నష్టపోయిన గోదావరి వరద ముంపు బాధితులు, నిరుపేదల ఇళ్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో మంగళవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ నాయకులు మాట్లాడుతూ.. గత 17 నెలలకు పైగా బాధితులు ఇండ్ల కోసం ఆందోళన చేస్తున్నారని, గత ప్రభుత్వం కానీ, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధితుల సమస్యను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని వారు కోరారు. ఎన్డీ జిల్లా నాయకుడు బానోత్ ఊక్లా నాయక్, ఎస్‌డీఎల్‌సీ నాయకురాలు పెద్దగోని ఆదిలక్ష్మి, పీఓడబ్ల్యూ డివిజన్ కార్యదర్శి భూలక్ష్మి, అధ్యక్షురాలు రాధ, సహాయ కార్యదర్శి లక్ష్మి, కమల, సంధ్య, కృపారాణి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

చర్ల: మండలంలోని కలివేరు గ్రామపంచాయతీకి చెందిన పలువురు ఉపాధిహామీ కూలీలకు చెల్లించాల్సిన కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ సబ్ డివిజన్ కార్యదిర్శ ముసలి సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉపాధిహామీ కూలీలతో కలిసి ఆయన చర్లలోని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఏపీఓ సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. కూలీలకు డబ్బులు చెల్లించకుండా రోజుల తరబడి ఆపుకోవడం ప్రభుత్వానికి సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు చిరిగిడి నరేష్, కనితి భాను ప్రకాశ్, అమీరా జాహ, అమీనా పాల్గొన్నారు.

ధర్నాకు కదిలిన నాయకులు

అశ్వాపురం: ఎస్సీ వర్గీకరణ, జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ధర్నా, మౌన దీక్ష, నిరసన కార్యక్రమం నిర్వహించగా.. ఆయా కార్యక్రమాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాదిగ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

గ్యారంటీలను అమలు చేస్తాం

- వంద రోజుల్లో ఆచరణ
- తులం బంగారమూ అందిస్తాం
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాయం



మణుగూరురూరల్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే రూ.500లకు గ్యాస్ సిలిండర్, పేద మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రేషన్ కార్డులను జారీ చేయనుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బచ్చల భారతి, తాటి సావిత్రి, ఉపసర్పంచులు తరుణ్‌రెడ్డి, గోరంట్ల కనకయ్య, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పినపాక: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోనే కచ్చితంగా అమలు చేసి తీరుతామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పినపాక గ్రామంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాసనసభ్యులుగా ఎన్నికైన తరువాత మండలానికి వచ్చిన ఎమ్మెల్యేకు తహసీల్దార్, ఎంపీడీఓలు స్వాగతం పలికారు. అనంతరం 38 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడిన ఆయన.. త్వరలోనే కల్యాణలక్ష్మితో పాటు మహిళకు తులం బంగారం కూడా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విస్తృత పర్యటన..

బూర్గంపాడు: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. మణుగూరు క్రాస్‌రోడ్‌లోని శ్రీతిరుపతమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోలవరం గ్రామంలో స్థానిక మహిళలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అక్కడ ఆయనకు మాజీ జెడ్పీటీసీ సభ్యులు బట్టా విజయ్‌గాంధీ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. మోరంపల్లిబంజరలో నూతనంగా నిర్మించిన ఓ ఫంక్షన్ హాల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై వారితో చర్చించారు.

శుభాకాంక్షలు తెలిపిన డీఎస్పీ..

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మంగళవారం ఆయన నివాసంలో మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ వెంకటేశ్వర్లు వేర్వేరుగా కలిశారు. నూతనంగా ఎన్నికైన సందర్భంగా వారు శాలువాతో ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి ఎమ్మెల్యే పాయంకు శుభాకాంక్షలు తెలిపారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ములకలపల్లి: ప్రభుత్వ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సున్నితంగా హెచ్చరించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు దూరం, వైరం వద్దని, ప్రజాక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుదామని హితవు పలికారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల నుంచి వచ్చిన వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గెలుపొందిన తరువాత తొలిసారిగా మండలానికి వచ్చిసిన ఎమ్మెల్యే జారెను పలుశాఖల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేలిసి సత్కరించారు. ఎంపీపీ మట్ల నాగమణి, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ శ్రీను, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో ఎమ్మెల్యే..

తొలుత అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన తలంబ్రాలకు మండలకేంద్రంలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. స్థానిక పూజార్లు ముకుందల సత్యనారాయణశాస్త్రి, విస్సావజ్జలు సురేశ్‌శాస్త్రి శాస్త్రోక్తంగా స్వాగతం పలికారు. భర్త అభయాంజేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో కలశాన్ని నెత్తిన ఎత్తుకున్న ఎమ్మెల్యే జారె పురవీధుల్లో శోభాయాత్రలో పాల్గొన్నారు. పల్లకీ మోశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు శనగపాటి రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, ఎంపీటీసీ మోహరమణి, ములకలపల్లి ఉపసర్పంచ్ శనగపాటి అంజి, సర్పంచ్‌లు కారం సుధీర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల శ్రమను మరిచిపోను..

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా భారీ విజయాన్ని సాధించేందుకు పూర్వ విద్యార్థులంతా విశేష కృషి చేశారని, ఆ శ్రమను మరిచిపోనని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని వినాయకపురం గ్రామంలోగల శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ ఆలయం వద్ద 2000–2008 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించారు. తుట్టి మహేష్, మాడి రమేష్, తేజావత్ లాలు నాయక్, భూక్యా మల్లేష్ నాయక్, సూర్యప్రకాశ్, సున్నం తిరుపతిరావు ఉన్నారు.

ఏరియా ఆస్పత్రిలో తనిఖీ



కంటి ఆపరేషన్ల పరికరం వివరాలు తెలుసుకుంటున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిని మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తనిఖీ చేశారు. అన్ని వార్డులు తిరిగి చికిత్స పొందుతున్న రోగులతో ఆయన మాట్లాడారు. వారికి అందుతున్న సేవలపై ఆయన ఆరా తీశారు. వైద్య సేవల్లో జాప్యం జరిగితే వెంటనే తన దృష్టికి తీసుకుని రావాలని ఆయన రోగులకు వివరించారు. అదే విధంగా ఏరియా ఆస్పత్రిలో గల ఇటీవల రోగులకు కంటి వైద్య ఆపరేషన్లు ప్రారంభించిన విషయాన్ని తెలుసుకున్న ఆయన.. సదరు రోగుల వద్ద వెళ్లి వైద్యులు ఆపరేషన్ చేసి విధానం, తరువాత తీసుకున్న చర్యలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి అందిన నిధులు, అందాల్సిన నిధులకు సంబంధించిన వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ఉపయోగంలోకి వచ్చిన కంటి శాస్త్ర చికిత్సలకు ఉపయోగించే పరికరాన్ని ఆయన పరిశీలించి, దాని ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు రోగుల పట్ల ప్రేమతో మెలగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, కంటి వైద్య నిపుణుడు సంతోష్, వైద్యులు విజయ్ రావు, ఇన్‌చార్జ్ నర్స్ దుర్గాభవానీ, హెడ్ నర్స్‌లు సుందరీ, విజయశ్రీ, సీత, సునీత, నిర్మల, రాజ్యలక్ష్మి, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు–ప్రవీణ దంపతులను మంగళవారం బొలిశెట్టి రంగారావు నివాసం వద్ద గ్రీన్ భద్రాద్రి ప్రముఖులు శాలువాతో సత్కరించి మొక్కను బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం మాట్లాడుతూ.. గ్రీన్ భద్రాద్రి వారు భావితరాల భవిష్యత్తు కోసం మొక్కలు నాటడాన్ని అభినందించారు. కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు బెల్లంకొండ రాంబాబు, కార్యదర్శి శ్రీరంగం సంపత్, ఫౌండర్స్ బొలిశెట్టి రంగారావు, జి.రాజారెడ్డి, గౌరవాధ్యక్షులు యేగి సూర్యనారాయణ, మాజీ అధ్యక్షులు జి.శివ శంకర్ రావు, పల్లింటి దేశప్ప, గోళ్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణార్జునరావు, ఉపాధ్యక్షుడు ఉమాశంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

అన్నపురెడ్డిపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలని సీడీపీఓ నిర్మలాజ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని ఊటుపల్లి, అబ్బుగూడెం, అన్నదైవం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. 5 సంవత్సరాల లోపు పిల్లల ఎత్తు, బరువును క్రమం తప్పకుండా కొలవాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గంగాజలం, అరుణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు ఆహ్వానం

అశ్వాపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్–17 బాలికల క్రికెట్ పోటీల ప్రారంభానికి రావాలని ఎంఈఓ వీరస్వామి ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు మంగళవారం మణుగూరులో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి ఆహ్వానించారు. ఎంఈఓ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు వీరన్న, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సుమారు 50 మంది కార్మికులు టీబీజీకేఎస్ బ్రాంచ్ కమిటీని వీడి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో మంగళవారం పాయం క్యాంప్ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీలో చేరారు.

వీరికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఐఎన్‌టియుసి కండువాలు కప్పి యూనియన్‌లోని సాధరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే పాయంను యూనియన్ నాయకులు పూలమొక్క అందించి శాలువాతో సన్మానించారు. యూనియన్‌లో చేరిన వారిలో బానోత్ కృష్ణ, హజీజ్, అహ్మద్, మల్లికార్జున్‌లు ఉండగా.. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్, నాయకులు సోమరాజు, సామా శ్రీనివాస్‌రెడ్డి, నామా వెంకటేశ్వరరావు, ఏఎం చారి తదితరులు పాల్గొన్నారు.

నిజరూపంలో పర్ణశాల రామయ్య



స్వామి వారిని పురవీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం: పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా 7వ రోజు మంగళవారం రామయ్యను నిజరూప దర్శనం శ్రీరామావతారంలో కనిపించారు. ఆలయ అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భరద్వాజచార్యులు, అమరవాది కిషోర్‌కుమారాచార్యులు, నరసింహచార్యులు ఈ రూపంలోఅలంకరించారు. వ్యక్తిగత సౌఖ్యాలకన్నా ధర్మచరణయే ఉత్తమమైనదని, అదే శాశ్వతమైనదని భావించి పరిపూర్ణమైన మానవుడు ఎలా ఉండాలో ఆచరించి చూపించిన ఆదర్శ పురుషుడు, మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుడని అర్చకులు తెలిపారు. సూర్య గ్రహబాధ ఉన్న వారు రామావతారాన్ని దర్శించడం వల్ల విముక్తి పొందుతారని వివరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన అల్లం కనకదుర్గ ఆధ్వర్యంలో వేదవ్యాస జననం హరికథను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, సూపరిండెంట్ కిషోర్, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌నే గెలిపించండి

మణుగూరుటౌన్: రానున్న ఎన్నికల్లో కార్మికుల పక్షపాతిగా ఉన్న టీబీజీకేఎస్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఏరియా టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం ఓసీ స్టోర్స్, ఏరియా వర్క్‌షాప్, జీఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీలు గంగాధర్, మహబూబ్ పాష, మనోహర్ అధ్యక్షతన జరిగిన గేట్ సమావేశంలో మాట్లాడారు. అడిగిందే తడువుగా అన్ని పనుల్లో తోడుగా నిలిచిన టీబీజీకేఎస్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులను పాగొట్టడమే కాకుండా అనేక హక్కులు తాకట్టు పెట్టిన ఘనత జాతీయ సంఘాలది అని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రవూఫ్, వీరభద్రయ్య, కాపా శివాజీ, వర్మ, మునిగెల రమేశ్, సీతక్క, శ్రీను, శ్రీనివాసరెడ్డి, హబీబ్, అమీనుద్దీన్, రాందాస్ టీబీజీకేఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

సీఐటీయూను గెలిపించాలి..

మణుగూరురూరల్: కార్మిక ప్రయోజనాల కోసం గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు కోరారు. మంగళవారం మణుగూరు ఏరియాలోని ఓసీ–4, కొండాపురం భూగర్భగని, మల్లేపల్లి ఓసీలలో సీఐటీయూ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన గేట్ మీటింగ్‌లలో మందా నర్సింహారావు మాట్లాడుతూ.. కార్మికుల సొంతింటి కల నెలవేరాలన్న, పెర్క్స్‌పై ఇంకమ్ టాక్స్ రద్దు కావాలన్నా తదితర సమస్యలను పరిష్కరించబడాలంటే గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఉదయించే సూర్యుడు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.బ్రహ్మచారి, టీవీఎంవీ ప్రసాద్, పి.వెంకటేశ్వర్లు, డీవీ, గద్దల శ్రీనివాస్, సీపీఎం నాయకులు కొడిశాల రాములు, యు.నరసింహారావు, ఎస్.సాంబశివరావు, లక్ష్మణరావు, విల్సన్, రామ్మూర్తి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

దమ్మపేట: సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా చిన్నారులకు క్రిస్మస్ కానుకలను మండల కాంగ్రెస్ నాయకుడు చిన్నశెట్టి యుగంధర్ పంపిణీ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు వీధిలోని చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ప్రజా ప్రతినిధులు, నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. చర్చిలో నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలకు హాజరైన క్రైస్తవులు, నాయకులు, పాస్టర్లు కొవ్వొత్తులు వెలిగించి, దేవుని స్తుతించారు. వేడుకల్లో భాగంగా కేకును కట్ చేసి, అందరికీ పంచుతూ క్రిస్మస్ పాటలను ఆలపించారు. అనంతరం చిన్నశెట్టి యుగంధర్ సొంత ఖర్చులతో అనాథ పిల్లలు, చిన్నారులకు క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, అత్తులూరి వెంకటరామారావు, కక్కిరాల రమేష్, పగడాల రాంబాబు, కృష్ణమూర్తి, తాళ్ల శంకర్, పాస్టర్లు ఎలికే ఎసుపాదం, గడ్డం జాషువా, రవికుమార్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని రామన్నగూడెం గ్రామంలోగల సియోను ప్రార్థన మందిరంలో మంగళవారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముందుగా సెమీక్రిస్మస్ కేక్‌ను కట్ చేసి, విశ్వాసులకు పంపిణీ చేశారు. అనంతరం కొవ్వొత్తుల వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఏసు క్రీస్తు గీతాలను ఆలపించారు. ఈ వేడుకలకు రామన్నగూడెం, దిబ్బగూడెం, పండువారిగూడెం, నాగుల గుంపు, అశ్వారావుపేట, అల్లిగూడెం గ్రామాల నుంచి విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చర్చ్ పాస్టర్లు సున్నం సియోను కుమార్, పీటర్ రాజు, ప్రకాశ్‌రావు, నడ్డి దేవదాస్, జీజే నెహ్రూ, సీయోను కుమార్ రాజు, రాందాస్ రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన



మొక్కల వివరాలు వెల్లడిస్తున్న లెక్చరర్ జరీనా బాను

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల బోటనీ విద్యార్థులకు మంగళవారం వృక్ష సంబంధిత అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ చీన్యా ఆదేశానుసారం బోటనీ లెక్చరర్ ఎస్‌కె.జరీనా బాను విద్యార్థులకు బూర్గంపాడు పరిసర ప్రాంతాల్లో మొక్కలు, చెట్లను చూపించి వాటి శాస్త్రీయ నామాలు, ఆ మొక్కల ఉపయోగాలను వివరించారు. మొక్కల్లోని వివిధ విభాగాలు మానవులకు ఏవిధంగా ఉపయోగపడుతాయో తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'పొదెం'కు సముచిత స్థానం కల్పించాలి



భద్రాచలంఅర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రివర్గంలో చోటు ఇవ్వాలని టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. భద్రాచలంలో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2018లో జిల్లాలో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ బీఆర్ఎస్‌లోకి వెళ్లినా, డబ్బులకు, ప్రలోభాలకు, పదవులకు లొంగకుండా కాంగ్రెస్ జెండాను మోసిన విధేయుడు వీరయ్య అని ఆయన అన్నారు. గత ప్రభుత్వం నియోజకవర్గానికి నిధులు ఇవ్వకుండా వేధించినా లొగని వీరయ్యకు సముచితం స్థానం కల్పించాలని కోరారు. దీనిపై అన్ని మండల పార్టీ కమిటీలు ఏకగ్రీవంగా తీర్మానం చేసి సీఎం రేవంత్‌రెడ్డిని కలవాలని నిర్ణయించుకున్నట్లుగా ఆయన తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు బలుసు నాగసతీష్, సీనియర్ నాయకులు దొడ్డిపట్ల సత్యలింగం, ఎన్ఎస్ యుఐ నియోజకవర్గ అధ్యక్షుడు సరెళ్ల వెంకటేశ్, తోకల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య సేవలను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించి న్యాయం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని అంటిపెట్టుకుని కార్యకర్తలకు అండగా ఉన్న ఆయనకు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి సీతారామారావు, సర్పంచ్‌లు నాగేంద్రబాబు, వర్ష చిన్నారావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోడి చంటిబాబు, శీరపు అప్పల రెడ్డి, తెల్లం హరి, కోర్స సీతారామయ్య, లంక రామ్ ప్రసాద్, రాజారెడ్డి, దర్శి సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, పర్ణశాల సర్పంచ్ తెల్లం వరలక్ష్మి, జిల్లా సోషల్ మీడియా చైర్మన్ కనుబుద్ది దేవాలు మంగళవారం వేరువేరు ప్రకటనలో ఇదే డిమాండ్‌ను వినిపించారు.

వేతనాల అమలుకు కృషి చేయాలి

మణుగూరురూరల్: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాల అమలుకు కృషి చేయాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీఎంఎస్ జాతీయ నాయకుడు, వేజ్‌బోర్డ్ కమిటీ సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ మాట్లాడుతూ.. 2013లో హైపవర్ కమిటీ వేతనాలకు సంబంధించి సర్క్యులర్ విడుదలైనప్పటికీ నేటి వరకు అమలుకు నోచుకోవడం లేదన్నారు. వేతనాల అమలుకు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారంపై సింగరేణి యాజమాన్యంతో చర్చించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు రాజు, రవి, నివాస్, తిరుపతి, సారయ్య, సమ్మయ్య, ఇజ్రాయేల్, ముత్తమ్మ, సీత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

దమ్మపేట: గతంలో గృహ నిర్మాణ శాఖ నుంచి తొలగించిన హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ.. వారు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే జారే నివాసంలో ఆయనను గతంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు ఉద్యోగ అవకాశం కల్పించి, ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సంబంధిత మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. పలువురు మాజీ ఉద్యోగులు పాల్గొన్నారు.